

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

సోమవారం | 05 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08


# ఆర్థిక ఒత్తిడిలోనూ ప్రతి పేదింటికి అండ

పేదల దరికి సంక్షేమ ఫలాలు

పోడు భూములకు తీపి కబురు

లక్ష్మీదేవిపల్లి భూ సమస్యలకు చెక్

పట్టభద్రుల ఓటు నమోదు చేయించాలి

మంత్రి పొంగులేటి



**కొత్తగూడెం, అక్షిత న్యూస్:** రాష్ట్ర ఖజానాపై ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ పేదల సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ..మిగతా 2లో

# జర్నలిస్టుల సంక్షేమానికి ఆసరా

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ



**ఉప్పల్, అక్షిత ప్రతినిధి :** జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై పలువురు జర్నలిస్టులకు తన చేతుల మీదుగా ఇన్సూరెన్స్ బాండ్లను అందజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ..మిగతా 2లో



# లక్ష్మణ్ చందాలో లక్షల్లో దోపిడి

గిడ్డంగుల్లో డస్ట్ దందా!

ఇసుకతో కట్టట్లే డస్ట్‌తోనే కట్టడాలు

ప్రాణాలతో చెలగాటం






**లక్ష్మణ్ చందా/బోరిగాం, అక్షిత న్యూస్ :** లక్ష్మణ్ చందా మండలం బోరిగాంలోని తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (టిఎస్ డబ్ల్యూసి) కాంప్లెక్స్ లో జరుగుతున్న కోట్ల రూపాయల అదనపు గోడౌన్ నిర్మాణంలో అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**స్థానికుల ఆరోపణ ఇసుక జాడే లేదు!**

స్థానికులు ఆరోపిస్తున్న ప్రకారం, నిర్మాణ స్థలంలో నది ఇసుక కుప్ప ఒక్కటి కూడా లేదు. ఉన్నదంతా నల్లటి క్రషర్ డస్ట్ (రాతి దుమ్ము) మరియు కంకర మాత్రమే. నిబంధనల ప్రకారం ఐఎస్ 383 ప్రమాణాలు ఉన్న ఇసుకనే వాడాలి. కానీ ఇక్కడ 100% డస్ట్‌తోనే పని కానిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**రూ.65 వేల ఇసుకకు బదులు రూ.4 వేల డస్ట్!**

స్థానికుల కథనం ప్రకారం, ఒక లారీ నది ఇసుక ధర ప్రస్తుతం లిరూ.60,000 నుండి రూ.65,000 ఉంది. అదే ..మిగతా 2లో

# రైతు ప్రగతితోనే దేశ ప్రగతి

సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి

తూప్రాన్ డెయిరీ ప్లాంట్‌కు నాంది

రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్..

18 నెలల్లో నిర్మాణం పూర్తి రైతులకు అదనపు ఆదాయం..

మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

**మెదక్, అక్షిత బ్యూరో:** సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని ..మిగతా 2లో



## జర్నలిస్టుల సంక్షేమానికి ఆసరా

**మొదటి పేజీ తరువాయి...**



గుడి మధుసూదన్ రెడ్డి అందించిన ఆర్థిక సహకారంతో ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు ఇన్సూరెన్స్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి భవిష్యత్‌లోనూ తన సహకారం కొనసాగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, నేర్థం భాస్కర్ గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి, తిరుమలేష్, కొంపల్లి రవీందర్, పల్లె రాజకుమార్ గౌడ్, గడ్డం పాపిరెడ్డి, పిట్టల నరేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ప్రగతితోనే దేశ ప్రగతి

**మొదటి పేజీ తరువాయి...**

తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు.

**రైతు ఉత్పత్తులకు విలువ జోడింపే లక్ష్యం**

రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతో పాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు.

**సహకారంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట**

రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని కిషన్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అవి నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులే సహకార వ్యవస్థలో భాగస్వాములైతే దళారుల దోపిడీ, అవినీతి, రాజకీయ నాయకుల పెత్తనం తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సహకార సంఘాల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల్లోనే వినియోగమై స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని వివరించారు. సహకార ఉద్యమం కేవలం వ్యాపార నమూనా కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ సహకార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

**అమూల్ విజయమే రైతుల విజయం**

సహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1964లో 19 సహకార సంఘాలతో రోజుకు 5,100 లీటర్ల పాల సేకరణతో ప్రారంభమైన సాబర్ డెయిరీ నేడు రోజుకు సుమారు 50 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ స్థాయికి చేరిందన్నారు. సుమారు 50 వేల మంది పాల ఉత్పత్తిదారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, 2025-26లో రూ.10,500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిందని తెలిపారు. అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళ్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.

# లక్ష్మణ్ చందాలో
# లక్షల్లో దోపిడి

**మొదటి పేజీ తరువాయి...**



క్రషర్ డస్ట్ అయితే లిరూ.3,500 నుండి రూ.4,000లి కే వస్తోంది. ఒక్కో లారీకి దాదాపు రూ.56 వేలు మిగులుతుంది. 100 లారీలకు రూ.56 లక్షల లాభం కోసమే ఈ నాసిరకం పనిచేస్తున్నారని స్థానిక మేస్త్రీలు ఆరోపిస్తున్నారు.

**నకిలీ ఇటుకలతో గోడలు..స్థానికుల ఆరోపణ**

దీనికి తోడు పిల్లర్ల మధ్య సైట్ లోనే తయారు చేసిన, ఎలాంటి ఐఎస్ఐ ముద్ర లేని నకిలీ సిమెంట్ ఇటుకలతో గోడలు లేపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఇటుకలు చేత్తో నొక్కితేనే పొడి అవుతున్నాయని కూలీలే చెబుతున్నట్లు స్థానికులు తెలిపారు.

**ఎందుకు ప్రమాదం? - నిపుణుల అభిప్రాయం ప్రకారం**

నిపుణులు చెబుతున్న ప్రకారం, రాతి డస్ట్ లో 30% వరకు మైక్రో దుమ్ము ఉంటుంది. ఇది సిమెంట్ ను పట్టనివ్వదు. దీంతో భవనం బలం 50% వరకు తగ్గే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డస్ట్ కు ఎక్కువ నీళ్లు కావాలి, ఆ నీళ్లు ఎండిపోగానే గోడలకు భారీ పగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. రేపు ధాన్యం బస్తాల బరువుకు గోడ కూలితే కూలీల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

ఐఎస్ 383 (1970) చట్టం ప్రకారం కాంక్రీట్ లో నూట యాభై మైక్రాన్ కంటే తక్కువ దుమ్ము మూడు శాతం కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ క్రషర్ డస్ట్ లో ఈ దుమ్ము పదిహేను శాతం నుండి ఇరవై శాతం వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి వంద శాతం డస్ట్ వాడటం పూర్తిగా చట్ట విరుద్ధమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ నిధులు వృధా కాకుండా, హమాలీల ప్రాణాలకు ముప్పు రాకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా విచారణకు ఆదేశించి, ఎన్ డిటి పరీక్షలు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్థిక ఒత్తిడిలోనూ
# ప్రతి పేదింటికి అండ

**మొదటి పేజీ తరువాయి...**



అండగా నిలుస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని భూ సమస్యలను పరిష్కరించి అర్హులకు పట్టాలు అందిస్తామని, పోడు భూముల సమస్యపై త్వరలోనే ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందని హామీ ఇచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామపంచాయతీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు దేవరగట్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు.

**రైతులకు అండగా ప్రభుత్వం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు దొరల పాలన సాగిందని మంత్రి విమర్శించారు. గత పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వరి పంట వేయాలంటే భయపడే పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. అలాంటి పాలనతో విసిగిపోయిన రైతులు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు మద్దతు ధరతోపాటు సన్న బియ్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.12 వేల చొప్పున అందించడంతో పాటు రుణమాఫీని కూడా అమలు చేశామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**పేదల సంక్షేమమే ప్రాధాన్యం**

ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దేశంలోనే ఇలాంటి పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని మంత్రి అన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ.72 కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని చెప్పారు.

గత ప్రభుత్వాలు పదేళ్ల పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి విడతగా 4.5 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించామని, ఇప్పటికే 2.5 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌లో 'ఇందిరమ్మ టవర్స్' పేరుతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టి, కోటి రూపాయల విలువ చేసే ఫ్లాట్లను నిరుపేదలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**హామీలన్నీ అమలు చేస్తాం**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అర్హులకు పట్టాలు అందిస్తామని చెప్పారు. పోడు భూముల సమస్యపై కూడా త్వరలో ప్రభుత్వ పరంగా శుభవార్త అందిస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నకు మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.

# సోను లేడీస్ ఎంపోరియం పోలీసులపై దాడులు

**సోను లేడీస్ ఎంపోరియం పోలీసుల పై దాడులు**

**నిషేధిత కాస్మోటిక్స్,స్కిన్ కేర్ ఉత్పత్తులు పట్టివేత**



**వికారాబాద్, అక్షిత బ్యూరో :** బ్యూటీ ఫుల్ గా రెడీ చేస్తామంటూ,ఫేక్ ఫేస్ క్రీమ్స్ వాడుతూ లేడీస్ ఎంపోరియం నిర్వాహకులు డబ్బులు దండుకుంటున్నారు. ఫేక్ ఫేస్ క్రీమ్స్,స్కిన్ క్రీమ్స్ లు వాడి లేడీస్ ఎంపోరియం వారు ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్నారు. దానిపై ఫిర్యాదులు రావడంతో వికారాబాద్ పోలీసులు వికారాబాద్ లోని ఒక లేడీస్ ఎంపోరియం పై దాడులు నిర్వహించారు.వివరాల్లోకి వెళ్తే పట్టణంలో అనుమతులు లేకుండా నిషేధిత కాస్మెటిక్స్, స్కిన్ కేర్ ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. టౌన్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు ఎస్సై మీనాక్షి ఆధ్వర్యంలో పోలీసు బృందం తనిఖీలు చేపట్టింది. మరివికారాబాద్ పట్టణంలోని సోను లేడీస్ ఎంపోరియంలో అనుమతులు లేని కొన్ని స్కిన్ కేర్ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్సై మీనాక్షి, కానిస్టేబుల్ కవిత, క్రైమ్ కానిస్టేబుల్ భరత్ తదితరులతో కలిసి దుకాణంలో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో 16 రకాల స్కిన్ కేర్ ఉత్పత్తులు, 12 గోరి సబ్బులు సహా అవసరమైన అనుమతులు, విక్రయ నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.ఆరోగ్య సమస్యలపై ఫిర్యాదులు గోరి విటమిన్ సబ్బు తదితర ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ గతంలో కొన్ని ప్రాంతాల్లో ఆరోపణలు, ఫిర్యాదులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వికారాబాద్ ఎస్ఐ మీనాక్షి మాట్లాడుతూ...నిషేధిత కాస్మోటిక్స్ వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.ముఖ్యంగా కిడ్నీ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు.అయితే ఆయా ఉత్పత్తుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే అంశంపై తుది నిర్ధారణ సంబంధిత డ్రగ్, కాస్మెటిక్స్ నియంత్రణ అధికారులు, ప్రయోగశాల పరీక్షలు, అధికారిక నివేదికల ఆధారంగానే జరగాల్సి ఉంటుందని అన్నారు.ప్రజలు బ్యూటీగా మారుతామని నమ్మి మోసపోవద్దని తెలిపారు.

# మునగాల మండల కేంద్రంలో హెలికాప్టర్ స్థలాన్ని పరిశీలన

**టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మి నారాయణ రెడ్డి**

**అక్షిత న్యూస్ మునగాల:** ఈ నెల 6 నా మండల పరిధిలోని ఎస్ఎంపేట రెవిన్యూ శివారులో అక్షయపాత్ర వంటశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేయుస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు బట్టి విక్రమార్క నీటిపారుదల శాఖ మంత్రివర్యులు కెప్టెన్ యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంచార్జీ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారు పర్యటనా భాగంగా మునగాల మండల కేంద్రంలో హెలికాప్టర్ స్థలాన్ని టిటిపిసిసి రాష్ట్ర కార్యదర్శి



చింతకుంట్ల లక్ష్మి నారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావుమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావుమండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నల్లపాటి శ్రీనివాస్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యలక నరేందర్ రెడ్డి, ఉప్పుల జానకి రెడ్డి, ఉప సర్పంచ్ కాసర్ల వెంకట్, దేవినేని రవియూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి శెట్టి గిరి,సీతాయ్య, తదితరులు పరిశీలించారు

# ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

**ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ శాసనసభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమాజంలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లే నూతన పాలకవర్గ ఎంపిక కోసం జరుగుతున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ పోలింగ్ ప్రక్రియలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రెడ్‌క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



# పత్తి రైతులకు ఎకరానికి 50 వేల నష్టపరిహారం చెల్లించాలి

**జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడం లింగయ్య డిమాండ్**




**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి, పంట బీమా వర్తింపజేసి ఆదుకోవాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడం లింగయ్య డిమాండ్ చేశారు. తిరుమలగిరి మండలంలోని వెలిశాల గ్రామంలో ఎండిపోయిన పత్తి చేలను రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మరియు సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం చేత వర్షాలు లేక, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నకిలీ విత్తనాలు, నకిలీ ఫెర్టిలైజర్లు మార్కెట్లోకి రావడంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా దక్కక తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పత్తి పంటకు అగ్గి తెగులు సోకడం వల్ల కాయలు, పూలు రాలిపోయి చేన్లు ఎండిపోతున్నాయని, దీనివల్ల రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి వేలాది ఎకరాలలో దెబ్బతిన్న పత్తి చేలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాలని, లేనియెడల రైతులను కూడగట్టి రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ మండల కార్యదర్శి కడారు లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిత్తలూరు సోమయ్య, సీపీఎం సీనియర్ నాయకులు బుర్గుల ప్రభాకర్, నరసయ్య, రైతులు కొమరయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వైద్య చిత్ర విశ్లేషణపై పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కందుల రేవతి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వైద్య చిత్రాల పునరుద్ధరణ, వర్గీకరణ కోసం నూతన అల్గారిథమ్ ల అభివృద్ధి, పనితీరు మూల్యాంకనం' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. విజయ్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వల్లడించారు.కంప్యూటర్-ఎయిడెడ్ డయాగ్నోస్టిక్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి, డీప్ లెర్నింగ్, ఫీచర్ ఆప్టిమైజేషన్, న్యూరల్ నెట్ వర్కులు, ఇమేజ్ సెగ్మెంటేషన్ ను ఏకీకృతం చేస్తూ, వైద్య చిత్రాల పునరుద్ధరణ, వర్గీకరణ కోసం అధునాతన అల్గారిథమ్ లను అభివృద్ధి చేయడంపై ఆమె పరిశోధన దృష్టి సారించినట్టు వివరించారు. ప్రతిపాదిత పద్ధతులు 97.29 శాతం వరకు వర్గీకరణ కచ్చితత్వాన్ని సాధించాయన్నారు. ఇది మూల్యాంకనం చేసిన బేస్ లైన్ విధానాల కంటే గణనీయమైన మెరుగుదలను ప్రదర్శించినట్టు తెలియజేశారు.డాక్టర్ రేవతి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించి, ఆమె తన విద్య, పరిశోధన వృత్తిలో నిరంతర విజయం సాధించాలని వారు ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన కల్వకుర్తి బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మునిసిపాలిటీ తిలక్ నగర్ 3వ వార్డు వారణాసి రామకృష్ణ మృతి చెందడం జరిగింది విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ టౌన్ ప్రెసిడెంట్ భావండ్ల మధు కార్మిక నాయకుడు సూర్య ప్రకాష్ రావు కల్వకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ రాము నాయక్ మాజీ కౌన్సిలర్ నూనె శ్రీను 12000/-రూపాయలు ఆర్థిక సాయం గా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో నూనె శ్రీనివాస్ రమేష్ మధు లక్ష్మణ్ కప్పెర రామకృష్ణ మరియు కాదనివాసులు పాల్గొనడం జరిగింది.

## పానగల్ ఖిల్లా సందర్శించిన కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ప్రపంచ జంతువుల దినోత్సవ సందర్భంగా కొత్తకోట కు చెందిన ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు సుమారు 50 మంది ఆదివారం పానగల్ లోని గిరిదుర్గం సందర్శించి అక్కడి పురాతన కట్టడాలు, సంస్కృతి సంప్రదాయాలు పరిశీలించి చరిత్ర తెలుసుకున్నారు. రామగుండం, సీత గుండం, ముండ్ల గవి, అనేక ద్వారాలు పరిశీలించారు. ఈ కార్యక్రమం ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఆర్గనైజర్ పలుస శేఖర్ గౌడ్ సారథ్యంలో సభ్యు లు ఎల్లయ్య, రవీందర్ రెడ్డి,నగేష్ సాగర్, విక్రమ్ సింహా రెడ్డి,రామకృష్ణ,జగన్,లక్ష్మి రెడ్డి, ముంత రవి తదితరులు ఉన్నారు.

## గిరిజన సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తా

### బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు తిరుపతి నాయక్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** గిరిజన సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు తిరుపతి నాయక్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ పార్టీ నాయకత్వానికి ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి ఎంతగానో సహకరించి, ఆశీస్సులు అందించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు సూచనల మేరకు, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు.గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా, గిరిజన తండాలు, గూడెం ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం ముందుండి పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలోకి విస్తృతంగా తీసుకెళ్తానని చెప్పారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

## కనిమెట్టలో వివిధ అభివృద్ధి

# పనులకు భూమిపూజ

### శంకర సముద్రం కింద సాగు అవుతున్న ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### కనిమెట్ట గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తా

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** సంవత్సరంలో కానాయపల్లి ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కరించి గ్రామాన్ని కాళీ చేస్తాం, శంకర సముద్రం కింద సాగు అవుతున్న ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో అంగన్వాడీ భవనం, మహిళా భవనం కు భూమిపూజ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గ్రామపంచాయతీ దగ్గర ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీయంఆర్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులను దృష్టిలో ఉంచుకొని శంకర సముద్రం కూడా కాల్వకు నీళ్లు ఎత్తిపోసేందుకు మోటార్ల మరమ్మత్తులకు 1లక్ష 15 వేలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కానాయపల్లి నిర్వాసితుల కోసం 7 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని పనులు కూడా త్వరలో ప్రారంభించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాని తెలిపారు. కనిమెట్ట గ్రామంలో కాళికాదేవి కట్టను వెడల్పు కావాలని గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు 15 లక్షల నిధులతో పనులు పూర్తి చేయించానని గుర్తు చేశారు. కనిమెట్ట నుండి వర్నె వరకు బిటి రోడ్ కొరకు 6 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో మండడి కుర్మక్క, మండడి దేవన్న పెన్షన్ రాలేదన్న నెపంతో ఇద్దరు ఆత్మహత్య చేసుకొని చనిపోయారని బిఆరెస్ నాయకులకు వారి శాపమే చుట్టుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు వారి కుమారుడు మండడి కృపనందంకు ఇందిరమ్మ మంజూరు చేస్తూ ఇల్లు దగ్గర ఉండి నేనే కట్టించి అప్పగిస్తానని హామీ ఇచ్చారు. యాదవ కమ్యూనిటీ హాల్ అసంపూర్తిగా ఉందని దానిని పూర్తి చేసేందుకు 5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది, పాఠశాలను 10 వాళ్ళ తరగతి వరకు అప్ గ్రేట్ చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో ఇప్పటికే 40 లక్షలు వివిధ అభివృద్ధి పనులకు ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పటికే 38 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని రెండో విడతలో మరో 25 ఇండ్లు ఇచ్చి తిరుతామని గ్రామంలో ఇల్లు లేని వారు ఉండొద్దని అన్నారు. గ్రామంలో రైతులకు లో ఓల్టేజ్ సమస్య ఉందని గ్రామానికి సబ్ స్టేషన్ కావాలని, కామన్ ఏర్పాటు చెయాలనీ, డ్రైనేజీ, సీసీ రోడ్లకు నిధులు ఇవ్వాలని సర్పంచ్ రామచంద్రయ్య యాదవ్ ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీమపల్లి యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, మాసన్న, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, గుంత రమణ, కోటేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, యాదగిరి, పెంటన్న,పరమేష్, మిరాసిపల్లి శేఖర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, సాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిడబ్ల్యూఎంసి ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు తగ్గించడం హేయమైన చర్య

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

### దాస్యం వినయ్ భాస్కర్



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికుల వేతనాలను తగ్గించడం అత్యంత అన్యాయమైన, హేయమైన చర్య అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జిడబ్ల్యూఎంసి లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో దాస్యం వినయ్ భాస్కర్ నీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు జిడబ్ల్యూఎంసి లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.25,000 అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకపోగా, ఇప్పుడు కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి, వరంగల్ మహానగర పాలక సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 519 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను తగ్గించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికుల వేతనాలను వారి కష్టానికి, సేవలకు అనుగుణంగా రూ.16,500 నుంచి రూ.23,500 వరకు పెంచామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీ=ఆ కార్మిక విభాగం కన్వీనర్ నాయిని రవి, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు న్యాయవాది రామూర్తి, పలువురు కార్మిక నాయకులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్ రెడ్డి జన్మదినం సందర్భంగా అనూహ్యంగా స్పందించిన రక్తదాతలు

### 278 యూనిట్ల రక్తసేకరణ

### రక్తదాతలను ప్రశంసా పత్రంతో అభినందించిన మాజీ మంత్రి




**వనపర్తి అక్షిత ప్రతినిధి :** తెలంగాణ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదినం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బిఆరెస్ నాయకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలుచోట్ల యువకులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించి సామాజిక సేవలు చేశారు. బి.ఆర్.ఎస్ పట్టణ,మండల యువ నాయకులు, సూర్యవంశం.గిరి, హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, సహకారంతో 132యూనిట్ల రక్తసేకరణ చేశారు. నాగవరం యువత 60 యూనిట్ల రక్తసేకరణ చేశారు.

శ్రీరంగాపూర్ మండలం కంభాలపురంలో 21యూనిట్ల రక్తసేకరణ, సరోజినీ హాస్పిటల్ పెబ్బేరు 65యూనిట్ల రక్తసేకరణ, మొత్తంగా 278యూనిట్ల రక్తసేకరణ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. అపాయ,అత్యవసర పరిస్థితులలో ఉన్న అభాగ్యులను ఆదుకోడానికి అనూహ్యంగా స్పందించి రక్తాన్ని అందించిన ప్రతి ఒక్కరికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభినందించి సన్మానించారు. హంగు,ఆర్భాటాలు లేకుండా పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**విజయవంతం అయిన కంటి వైద్య పరీక్షలు**

గోపాల్ పేట సర్పంచ్ కర్రోళ్ల.స్వప్న భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతం అయ్యింది మొత్తం 200మంది పరీక్షలు నిర్వహించగా 30మందికి ఆపరేషన్,72మందికి కళ్ళజోడులు అందించాలని నిర్ణయించారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఒక మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల.అశోక్, రాజేష్ గౌడ్,వడ్డెమాన్.రవి,సర్పంచ్ శేఖర్,మన్నే నాయక్ తదితరులు ఉన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# రైతుల విద్యుత్తు సమస్యకు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### రెండున్నరేళ్లలో 11 కొత్త సబ్‌స్టేషన్లు తీసుకొచ్చాం

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: 2024 సంవత్సరం కంటే ముందు వివిధ ప్రభుత్వాల హయాంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కేవలం 19 విద్యుత్ సబ్‌స్టేషన్లు మాత్రమే ఏర్పాటు కాగా, తాను ఎమ్మెల్యే గా ఎన్నికైన రెండున్నరేళ్లలోనే కొత్తగా 11 విద్యుత్తు సబ్‌స్టేషన్లను మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం లోని రైతులకు వ్యవసాయ వినియోగదారుల విద్యుత్తు నియంత్రికల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎదురైన భూ సమస్యలను పరిష్కరించి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. కొన్ని సబ్‌స్టేషన్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు, హన్వాడ మండలంలోని గొండ్యాల గ్రామంలో 132 కేవీ సామర్థ్యం కలిగిన భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కూడా కృషి చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు గృహ విద్యుత్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ కలిపి మొత్తం 587 ట్రాన్స్‌ఫార్మర్లను అందజేశామని చెప్పారు. ఇంకా ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు 42 వేల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి నెలకు సుమారు రూ.800 నుంచి రూ.1,200 వరకు విద్యుత్ బిల్లుల రూపంలో ఆదా అవుతోందని వివరించారు. దాదాపు 98 శాతం పేద కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం చేకూరుతోందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గతంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం సుమారు 13 వేల మెగావాట్ల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం అది 19 వేల మెగావాట్లకు చేరుకుందని యెన్నం తెలిపారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి కోతలు లేకుండా, ప్రజలకు మరియు రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా రైతులు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అవసరమైన విద్యుత్‌ను అందుబాటులో ఉన్న ధరలకు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని వివరించారు. గత పదేళ్లలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో తగినంత పురోగతి సాధించలేకపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కొత్త థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎడి సంతోష్, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య, నాయకులు జి.నర్సింహులు, టంకర కృష్ణయ్య యాదవ్, యాదిరెడ్డి, జె.వెంకటయ్య, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదు తప్పనిసరి

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు తన హక్కును వినియోగించుకోవాలి

### మునగాల మండలబి.ఆర్.ఎస్. పార్టీఉపాధ్యక్షులు సోమపంగు సైదులు

అక్షిత న్యూస్ మునగాల: నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బి.ఆర్.ఎస్.పార్టీ మండల ఉపాధ్యక్షులు సోమపంగు సైదులు, ఆదివారం పిలుపునిచ్చారు పట్టభద్రుల సమస్యలునిరుద్యోగం విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై తమ గొంతును వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కీలకమని ఆయన పేర్కొన్నారు

రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 6వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నందున అర్హులైన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. 2023 సంవత్సరం నాటికి డిగ్రీ లేదా బీటెక్ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటరుగా



నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు

గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు కూడా ప్రస్తుత ఎన్నికలకు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం అవసరమైన ధ్రువపత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఓటు హక్కు కేవలం నమోదు చేసుకోవడంతో ముగియదనిఎన్నికల సమయంలో బాధ్యతగా వినియోగించుకోవాల్సిన ప్రజాస్వామ్య ఆయుధమని సోమపంగు సైదులు అన్నారు. మండలంలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన కోరారు

## అంబేద్కర్ సంఘం ఎన్నిక రద్దు

### జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్

కరీంనగర్ అక్షిత న్యూస్: కరీంనగర్ నగర పాలక సంస్థ రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీ బీఆర్ఎస్ ప్యానెల్ గా చెప్పుకుంటూ స్థానిక పార్టీ ముఖ్య నాయకులను కలిసి, సన్మానం అందుకున్నట్లు సోషల్ మీడియాలో పలు చోట్ల పోస్ట్ చేయడం తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలను జోక్యం చేయడమనేది సంఘం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, అసలు ఈ ఎన్నిక ప్రక్రియలో ఏ ప్యానెల్ లేకున్నా బీజేపీ ప్యానెల్ పై బీఆర్ఎస్ ప్యానెల్ గెలిచిందని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ వెంటనే విచారణ జరిపించి తెలంగాణ అంబేద్కర్ కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని, ఇలా సంఘం ప్రతిష్ట కు భంగం కలిగించిన నూతన కమిటీపై క్రమశిక్షణ చర్యల్ని తీసుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లుతెలిపారు. ఈ మేరకు నూతన కమిటీ సకాలంలో వివరణ ఇవ్వకుండా జాప్యం చేయడమే కాకుండ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినందుకు చర్యగా ఎన్నికైన కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగిందని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా గుగులోతు విజయ దేవి



కరీంనగర్ అక్షిత బ్యూరో: భారతీయ జనతా పార్టీ ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా గుగులోతు విజయ దేవి నియామక మయ్యారు భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా నియామకమైన సందర్భంగా ఆమె బిజెపి సీనియర్ నాయకత్వానికి మరియు పార్టీ శ్రేణులకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా విజయదేవి మాట్లాడుతూ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా తన నియమకానికి పూర్తిస్థాయిలో సహకరించిన, ఆశీస్సులు అందించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులుఎన్.రామచంద్ర రావు కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనను గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా నియమించిన బిజెపి పార్టీ ఎస్టీ మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్, కరీంనగర్ జిల్లా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులుసాయిని మల్లేష్ కు జిల్లా బిజెపి నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను క్రమశిక్షణకు లోబడి గిరిజన సోదర సోదరీమణుల సమస్యల పరిష్కారం కోసం గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం, భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలు నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతానని ఆమె వెల్లడించారు.

## జానపద గాయకుడికి కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్‌లో గుర్తింపు




వనపర్తి అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన జానపద గాయకుడు వై. నరేందర్ గౌడ్ కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ లో గుర్తింపు పొందారు. హైదరాబాద్ లోని త్యాగరాయ గాన సభలో అంజలి మీడియా గ్రూప్ – అందరి టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన "సుస్వరాభిషేకం – 111 మంది గాయకులు, 111 పాటలు" అనే కార్యక్రమంలో నరేందర్ గౌడ్ పాల్గొని తన సొంత పాటలు పాడి తన గాత్రంతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ సర్టిఫికెట్, జ్ఞాపికతో పాటు ప్రత్యేక అభినందన పోస్టర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తమ ప్రతి కార్యక్రమంలో పాల్గొనీ మరిన్ని పాటలు పాడాలని కోరారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# రూ.54 లక్షలు డ్రా చేసి మిషన్లు ఎందుకు మార్చలేదు?



**దళితులను అవమానించేలా మాట్లాడితే ఖబర్దార్..**

**రవీందర్ రెడ్డి ఘాటు హెచ్చరిక..**

**తాండూరు అక్షిత ప్రతినిధి:** యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాజకీయంగా చర్చ నీయాంశమైంది. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ చైర్మన్‌పై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

రైస్ మిల్లు పేరుతో గత పీఏసీఎస్ పాలకవర్గం సుమారు రూ.54 లక్షలు డ్రా చేసిందని, అయితే మిల్లుకు సంబంధించిన మిషన్లను మార్చకుండానే నిధులు ఎలా డ్రా చేశారని, రవీందర్ రెడ్డి ప్రశ్నించారు. నిధుల వినియోగంపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆరోపించారు.

ఎలాంటి అక్ర మాలకు పాల్పడలేదంటూ, ఇటీవల కొందరు మీడియా ముందుకు వచ్చి ప్రకటించా రని, అయితే తాము బిల్లులు, ఎంబీ రికార్డులు, చెక్కులు వంటి ఆధారాలతో నిధుల డ్రాకు సంబంధించిన వివరాలను వెల్ల డించేందుకు సిద్ధంగా ఉన్నామని, అన్నారు. సంబంధిత రికార్డులను బహిర్గతం చేయాలని, సవాల్ విసిరారు.

**అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**

ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం మానుకుని, ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని, రవీందర్ రెడ్డి సూచించారు. నాలుగు మండలాల్లో ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ పనులు మినహా ప్రభుత్వం పెద్దగా అభివృద్ధి పనులు చేపట్ట


THE HYDERABAD DISTRICT CO-OP. CENTRAL BANK LTD.,

Ref No: HDCCB/PACS AS MSC/2023-24 Date: 21.12.2023

Release Order

Sub: PACS as MSC-Release of 1st installment/Initial Advance for purchase of Rice Mill Machinery -Reg:

Ref: 1. HDCCB Sanction Letter dated 13.12.2022

2. PACS Yalal request letter dated 17.11.2023

3. HDCCB I/c CEO note orders dated [illegible].2023

It is to inform that, for purchase of Rice Mill Machinery a total financial outlay of Rs.54,00,000/- has been sanctioned to the PACS Yalal vide ref 1st cited.

Further, vide reference 2nd cited, the Secretary of the PACS Yalal requested for release of 1st installment/Initial Advance of 65% i.e. Rs. 34,71,650/-

And vide reference 3rd cited, the bank has approved the request of PACS and agreed to release the Bank Loan Component i.e. Rs. 31,24,485/-

Hence, the Branch Manager, Tandur is hereby instructed to release an amount of Rs.31,24,485/-/-(Thirty One Lakhs Twenty Four Thousand Four Hundred and Eighty Five only) to the PACS and further inform the PACs to credit balance amount asper the quotation i.e. Rs. 3,47,165/- in their account at our DCC bank and transfer the full amount Rs.34,71,650/- on towards 1st Installment/Initial Advance for Rice Mill Machinery through RTGS to the vendor Palla Infra tech Pvt. Ltd.

Deputy General Manager

THE HYDERABAD DIST. CO-OP. CENTRAL BANK LTD.

Pay RTGS - Palla Infratech Pvt Ltd

Rupees Seventeen lakh only

₹ 17,00,000

PRESIDENT PACS YALAL

లేదని, విమర్శించారు.

దళితబంధు నిధుల విషయంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దొంగ బిల్లులు ఉన్నాయని ఆరోపించే వారు సంబంధిత ఎంబీ రికార్డులు, చెక్కులు, ఇతర ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని, డిమాండ్ చేశారు.

**వ్యక్తిగత ఆరోపణలపై ఘాటుగా స్పందన**

తనపై వ్యక్తిగతంగా చేస్తున్న ఆరోపణలపై కూడా రవీందర్ రెడ్డి స్పందించారు. తాను మద్యం సేవిస్తా నంటూ, చేస్తున్న వ్యాఖ్యలకు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని సవాల్ చేశారు. తనపై దళిత బంధు నిధులు తీసుకున్నానని, ఆరో పిస్తున్న వారు, అందుకు సంబంధించిన ఆధారాలను చూపించాలని, డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల ముందు సావు డప్పు కొడతామని, చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులను అవ మానించేలా, మాట్లాడటం సరికాదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా స్పందించాల్సి వస్తుందని, హెచ్చరించారు.

ఈ సమావేశంలో వడ్డే రాములు, మాజీ సర్పంచ్ అరవింద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, లాలు ముదిరాజ్, మేట్టి కృష్ణ, శరణు, మాజీ సర్పంచ్ పటేల్ రెడ్డి, నర్సింలు సర్పంచ్ పేర్కొంపల్లి, శ్రీశైలం, మహేశ్వర్ రెడ్డి, కృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన వ్యాపార కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించాలి..**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి తో పాటు వ్యాపార రంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే నాయిని... వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నయీమ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ జీ ఎం కాకతీయ ఫ్యాబ్రిక్, యునైటెడ్ హక్ వస్త్ర షోరూమ్‌లను ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ వేళ నూతనంగా ప్రారంభించిన వ్యాపార సంస్థలు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని షోరూమ్ నిర్వాహకులకు సూచించారు. నూతన వ్యాపారాల ద్వారా స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లే దారిలో పాత ఇనుపసామాన్ స్టోరేజ్ అగ్నిప్రమాదం..

**సాయి ప్లాస్టిక్ స్క్రాప్ గోదాములో మంటలు!**

**భారీగా ఎగసిపడుతున్న మంటలు.. దట్టంగా కమ్ముకున్న పొగ**

**ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు**



**కాశిబుగ్గ , అక్షిత న్యూస్ :** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏనుమాముల మార్కెట్ ఎదుట, చంద్ర కిరణ్ కోల్డ్ స్టోరేజ్ సమీపంలోని సాయి ప్లాస్టిక్ స్క్రాప్ గోదాములో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు భారీగా ఎగసిపడుతూ దట్టమైన పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఘనంగాతాండ్రరామచందర్ గౌడ్ జన్మదిన వేడుకలు..



**శేరిలింగంపల్లి అక్షిత:** శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాండ్ర రామచందర్ గౌడ్ జన్మదిన వేడుకలు స్నేహితుల మధ్య ఘనంగా నిర్వహించారు. శాలువాల తో సత్కరించి బర్త్ డే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ.శంకర్ గౌడ్, ఆర్. సతీష్ గౌడ్, నడిమింటి కృష్ణ,మనేపల్లిసాంబశివరావు, రవికుమార్ గౌడ్, బందారు శ్రీనివాస్ ముదిరాజ్, మన్నె నరేందర్ ముదిరాజ్, కృష్ణ గౌడ్ , గురువులు బండి రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొని తాండ్ర రామచందర్ గౌడ్ నిండు నూరేళ్ళు వర్ధిల్లాలనీ ఆకాంక్షిస్తూ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాండ్ర రామచందర్ గౌడ్ తనకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపినఅందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆదివాసీలకు అండగా ఉంటాం

**హక్కుల సాధన కోసం పోరాడుతాం**

**ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజిరెడ్డి**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సెక్రటరీ అంబటి జోజిరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోఆదివారం ఆదివాసీ హక్కుల సాధన సమితి (ట్రైబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆదివాసీ లకు భూమి హక్కులు కల్పించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పోడు భూముల రక్షణకు ఆదివాసీ ల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఆదివాసీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల రాష్ట్ర కమిటీలో గుడిపల్లి బిడ్డకు కీలక బాధ్యత

**రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నిక.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న నాగరాజు**



**గుడిపల్లి , అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా నల్గొండ జిల్లా గుడిపల్లికి చెందిన గోలి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదవ్‌తో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నాగరాజు ఎన్నిక పట్ల గుడిపల్లి ప్రాంతానికి చెందిన పలువురు ఉద్యోగులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం కొనసాగుతుంది



**పిఆర్సి విడుదల సిపిఎస్ రద్దుపై హామీ నిలబెట్టుకోవాలి**

**హెల్త్ కార్డు అమలుపై లోపాలను సరిచేయాలి**

**వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ పదోన్నతులు బదిలీలు చేపట్టాలి**

**పిఆర్టియు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**

**ఖమ్మం /అక్షిత బ్యూరో :** పిఆర్టియు ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు అధ్యక్షతన ఆదివారం సంఘ కార్యాలయం లో ఘనం గా జరిగింది. ఈ సమావేశం లో ముందుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు గత రెండు సంవత్సరాల సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా చర్చ అనంతరం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కౌన్సిల్ కు ముఖ్యఅతిథిగా హాజరైన ఖమ్మం -నల్గొండ - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత ధోరణి ని ఖండిస్తున్నామని పిఆర్సి విడుదల సిపిఎస్ రద్దు పై ప్రభుత్వ పెద్దలు మాట నిలుపుకోకపోతే పిఆర్టియు ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఉపాధ్యాయుల నుండి గత నాలుగు నెలలుగా హెల్త్ కార్డ్స్ కోసం ప్రీమియం కట్ చేస్తున్నారు కానీ నేటికీ హెల్త్ కార్డ్స్ అమలు సక్రమంగా జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమంది ఉపాధ్యాయ ఉద్యోగులు హెల్త్ కార్డు అమలు కాక ఇబ్బంది పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం హెల్త్ కార్డ్స్ లో లోపాలను సరి చేయాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ ప్రమోషన్లు బదిలీలు జరిగేలా కృషి చేస్తానని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ అమలు తీరు రేషనలై జేషన్ జీవో సవరణ ఎంఈఓ పోస్టుల భర్తీ ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా ఆన్లైన్ వర్క్ తగ్గించేలా అధికారులకు సూచిస్తానని పేర్కొన్నారు. ఈ కౌన్సిల్ సమావేశం లో సూర్యాపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టీ జితేందర్ రెడ్డి టీ నరేష్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు మోత్కూరి మధు యలమద్ది వెంకటేశ్వర్లు ఆఫీస్ ఇంచార్జి కె వెంకట నరసయ్య ఏఐఎఫ్టిఓ ఉపాధ్యక్షులు చిత్తలూరి ప్రసాద్ పత్రిక ఉపసంపాదకులు కేవీ రమణ పత్రిక ఎడిటోరియల్ బోర్డు మెంబర్ జీవీ రమణ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి విజయ అమృత్ కుమార్ ఆర్ బ్రహ్మారెడ్డి టీ రత్నకుమార్ జి సుజాత

కేజీబీవీ పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ సౌజన్య అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులు పిఆర్టియు కార్యకర్తలు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# టీచర్లు లేకపోతే పదవ తరగతి విద్యార్థులు ఎలా పాస్ కావాలి?

**టీచర్ల కొరతతో పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌పై ఆందోళన**
**మార్చిలో ఫైనల్ పరీక్షలు.**

**బోధించేందుకు సరిపడా సిబ్బంది కరువు**

**సుమారు 200 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లే..**

**అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ప్రశ్నలు**

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** మార్చిలో పదో తరగతి ఫైనల్ పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు.. వారికి పాఠాలు బోధించేందుకు టీచర్లు లేరు.. మరి విద్యార్థులు ఎలా పాస్ కావాలి? వారి భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారు? ఇదే ఇప్పుడు జైనూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రశ్న. పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న వేళ సిలబస్ పూర్తి చేయడం, విద్యార్థుల సందేహాలు తీర్చడం, రివిజన్ చేయించడం, పరీక్షల సన్నద్ధత కల్పించడం ఎలా సాధ్యమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక బోధన, పునశ్చరణ, పరీక్షలపై మార్గదర్శకత్వం అందడంపై ఆందోళన నెలకొంది. విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాల్సిన సమయంలో.. వారిని సిద్ధం చేయాల్సిన బోధనా సిబ్బందే లేకపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది.

**200 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లే!**

జైనూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇంత తక్కువ మంది సిబ్బందితో అన్ని తరగతులకు బోధన అందించడంతో పాటు పదో తరగతి విద్యార్థులను ఫైనల్ పరీక్షలకు సమర్థంగా సిద్ధం చేయడం ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**టీచర్లు లేకుండా.. పాస్ ఎలా?**

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు అత్యంత కీలకమైన దశ. ఈ సమయంలో పూర్తిస్థాయి బోధనతో పాటు రోజువారీ పునశ్చరణ, మోడల్ పరీక్షలు, సందేహ నివృత్తి, పరీక్షలపై ప్రత్యేక శిక్షణ అవసరం. అయితే బోధించేందుకు సరిపడా టీచర్లు లేకపోతే విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తిగా ఎలా నేర్చుకోవాలి? పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులు కావాలి? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**పరీక్షల ముందు అయినా స్పందించేనా?**

పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అదనపు ఉపాధ్యాయులను తక్షణమే కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మార్చిలో పరీక్షలు ఉండటంతో ఇక ఆలస్యం చేస్తే విద్యార్థుల సన్నద్ధతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





టీచర్ల కొరత ఇప్పుడు పాఠశాల సమస్య మాత్రమే కాదు.. 50 మంది పదో తరగతి విద్యార్థుల భవిష్యత్ సమస్య. టీచర్లు లేకుండా విద్యార్థులు ఎలా పాస్ కావాలి? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయుల కొరతను పరిష్కరిస్తారా అన్నదే ప్రశ్న.

**అధికారులకు వినతులు ఇచ్చినా**

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించేందుకు ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అయేష తెలిపారు. మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, అప్పటి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారిలకు పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించాలని వేర్వేరుగా వినతి పత్రాలు అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత కొనసాగుతుండటంతో విద్యార్థుల చదువుపై ఆందోళన నెలకొంది.

## హాస్టల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న నీరజ బాల్‌రెడ్డి**



**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు వార్డు నంబర్ 10లోని ఎస్టీ హాస్టల్‌లో బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, హాస్టల్ వార్డెన్ భాగ్యలక్ష్మి, హాస్టల్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడారు. చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని వారిని ఉత్సాహ పరిచారు. హాస్టల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, పరస్పరం బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట..**



**భద్రాచలం,అక్షిత న్యూస్:** సోమవారం భద్రాచలం, ఐ టి డి ఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు, ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని, మధ్య దళారులను ఆశ్రయించవద్దని నేరుగా ఐసిడిఏ,పిఓ,సబ్ కలెక్టర్ ని కలవాలని వారు తెలిపారు.. అలాగే సోమవారం ఉదయం జరగనున్న ప్రజావాణి గిరిజన దర్బార్ కు డివిజన్ పరిధిలోని అధికారులు సైతం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరాలలో తప్పకుండా హాజరుకావాలని వారు పేర్కొన్నారు...

## కరాటేతో ఆత్మ రక్షణ



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్టుల సర్టిఫికెట్లను ముఖ్య అతిథులు డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ జాతీయ అధ్యక్షులు బూడిద సైదులు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాలుగో వార్డు కౌన్సిలర్ పుట్టపాక శీను ఐదో వార్డు ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ జవహర్ కరాటే విద్యార్థిని విద్యార్థులకు సుమారు 100మందికి బెల్టులు సర్టిఫికెట్లు ఆదివారం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ వారు ఎంత గొప్ప శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని కొనియాడారు ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలి, ప్రతి ఒక్కరు శిక్షణ వినియోగించుకోవాలన్నారు. సీనియర్ కరాటే మాస్టర్ రామకృష్ణ నాయక్ ఎంతో గొప్పగా శిక్షణ ఇస్తున్నారని, ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు కూడ శిక్షణను పొందాలని కొనియాడారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు పాండవ శివ భారతి ప్రవల్లిక అజయ్ కిషోర్ అరుణ్ పాల్గొన్నారు

# నాచారం, హెచ్ఎంటీ నగర్‌లో కోటి రూపాయల అభివృద్ధి పనులు

**అభివృద్ధికి మౌలిక వసతులే ప్రాధాన్యం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, అక్టోబర్ 4:** నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్ల పరిధిలో సుమారు కోటి రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.9 లక్షలు, శ్రీ రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ.13 లక్షల నిధులను మంజూరు చేశారు. అలాగే కౌండిన్య నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.33.8 లక్షలు, భవాని నగర్‌లో మిగిలిన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.47.8 లక్షలు, రాఘవేంద్ర నగర్‌లోని శివ నర్సింగ్ హోమ్ వెనుక వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.20 లక్షల నిధులను కేటాయించారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్‌లతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. సాయి పృథ్వి, ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రామారావు, జలమండలి మేనేజర్ రోహిత్‌తో పాటు వివిధ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యులు, నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

**జిల్లా పోటీలకు ఎంపిక**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలో తెలంగాణ ఆదర్శ పాఠశాల అండ్ కళాశాల విద్యార్థులు కబడ్డీ క్రీడల్లో అద్భుత ప్రదర్శన, ప్రతిభ కనబరిచారు. దేవరకొండలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో పాఠశాల విద్యార్థులు 9వ తరగతి మాధవి, ఫస్ట్ ఇయర్ ఇంటర్మీడియట్ విద్యార్థి సాయి కిరణ్ మిర్యాలగూడ నియోజవర్గం తరపున జిల్లా సాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపల్ రంజిత ఫిజికల్ డైరెక్టర్ సుశీల పాఠశాల యజమానులు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## విస్డం పాఠశాల ప్రతిభకు గుర్తింపు.. ముగ్గురు ఉపాధ్యాయినిలకు జిల్లా అవార్డులు



**పర్వతగిరి అక్షిత ప్రతినిధి:** విస్డం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినిలు శ్రీలేఖ, గౌతమి, సునీతలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వరంగల్‌లోని నాని గార్డెన్‌లో తెలంగాణ రికగ్నైజ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మ), వరంగల్ డిస్ట్రిక్ట్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, నర్సంపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీలేఖ, గౌతమి, సునీతలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డులు పొందిన ఉపాధ్యాయినిలను పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు, రాష్ట్ర కార్యదర్శి రమేష్ రావు , జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, భూపాల్ రావు , దండపంతుల రామ్మూర్తి , రాధ కృష్ణ, అశోక్, రాజు, దేవేందర్ , జిల్లా డిసిబి కార్యదర్శి కృష్ణమూర్తి వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళావతికి ఎంపీ వద్దిరాజు ఘన నివాళి



**అక్షిత బ్యూరో, మహబూబాబాద్:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన పెద్దన్న కిషన్ తదితరులతో కలిసి స్వర్గీయ గంజి కళావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఇనుగుర్తిలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళావతి భర్త రాంరెడ్డి, కుమారులు రాజేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ సత్తూరి యాదగిరి, సింగిల్ విండో చైర్మన్ ధీకొండ వెంకన్న గౌడ్, మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గురునాథ్ చెరువు వాకింగ్ ట్రాక్‌లో స్వచ్ఛత కార్యక్రమం

**స్వచ్ఛందశీగా పరిశుభ్ర కార్యక్రమం**




**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లో గల మియాపూర్ సర్కిల్--48, డివిజన్--240 పరిధిలోని గురునాథ్ చెరువు వద్ద రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ మన్నే నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్ని రోజులుగా వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, గ్లాస్ ముక్కలు, చెత్త, పొదలు, ఎండిన గడ్డి మరియు ఇతర వ్యర్థాలను గురునాథ్ చెరువు వాకర్స్, వాలంటీర్ల సహకారంతో తొలగించామని నరేందర్ తెలిపాడు. దాదాపు 1.5 కిలోమీటర్ల మేర ఉన్న వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసి, వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వచ్ఛంగా, సురక్షితంగా మరియు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశామన్నాడు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగం అందించిన సహకారం ఎంతో అభినందనీయం. వారి సిబ్బంది సహకారంతో చెత్తను తొలగించి, ట్రాక్ పరిసరాలను మరింత శుభ్రంగా మార్చడం జరిగిందని పేర్కొన్నాడు.

గురునాథ్ చెరువులో ప్రతిరోజూ 500 మందికి పైగా వాకర్స్ వాకింగ్ చేస్తుంటారు. వారి ఆరోగ్యం, సౌకర్యం మరియు పరిశుభ్రమైన వాతావరణం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపాడు.

మన చెరువు – మన బాధ్యత, మన ట్రాక్ – మన ఆరోగ్యం, మన పరిసరాలు -- మన స్వచ్ఛత అనే నినాదం తో చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేసిన గురునాథ్ చెరువు వాకర్స్, వాలంటీర్లు మరియు శానిటేషన్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపినట్లు నరేందర్ ముదిరాజ్ తెలిపాడు.

## అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు రాష్ట్ర కమిటీ ఎన్నిక



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో అఖిల భారతీయ అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు, గురుస్వాములు, ట్రస్టు ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలు జరిపారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బొబ్బర్ల సురేష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా వెంకటేష్ గురుస్వామి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులు గా బూర్ల శ్రీనివాస్, మేడ్చల్ ఉపాధ్యక్షులు గా ఆకుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గా గుత్తా చంద్ర శేఖర్ రావు, కోశాధికారి గా పృథ్వి, జాయింట్ సెక్రటరీ గా వెలిది నాగరాజు, పి ఆర్ ఓ గా శేఖర్, నేషనల్ పి ఆర్ ఓ గా వెంకగల సాయిలు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ గా శ్రీపతి నర్సింహులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బొబ్బర్ల సురేష్ కుమార్ మాట్లాడుతూ శబరిమలలో ప్రతి నెల అయ్యప్ప ఆలయం తెరిచి ఉండే రోజుల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండల--మకరవిళక్కు మహోత్సవాల సందర్భంగా నవంబర్ 16 నుంచి జనవరి 20 వరకు సుమారు 65 రోజుల పాటు నిరంతర అన్నదాన సేవలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. అన్నదాన సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా భక్తుల సహకారంతో ట్రస్టు కార్యకలాపాలను బలోపేతం చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు, గురుస్వాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.